క్లుప్తంగా

కానిస్టేబుళ్లకు సన్మానం



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న సిబ్బంది

కేశంపేట: కేశంపేట పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీ అయిన కానిస్టేబుళ్లు భీంరాజ్, శివలింగం, శివప్రసాద్, కుమారస్వామిలను ఆదివారం తోటి సిబ్బంది ఎస్ఐ లింగంతో కలిసి పూలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో తోటి సిబ్బందితో పాటు జీఎంఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన నాయకులు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముబారక్ అలీఖాన్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అడిగిన వెంటనే నిధులను మంజూరు చేసినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞులు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఖాదీర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేశ్ రాథోడ్, ప్రశాంత్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా గౌండ్ల కావ్య

చేవెళ్ల: గ్రామ గ్రామాన బీజేపీ మహిళా మోర్చాను బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలో బీజేపీ మహిళా మోర్చా కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని కందవాడ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ గౌండ్ల కావ్యకృష్ణగౌడ్‌ను మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా, దేవుని ఎర్రవల్లికి చెందిన పద్మ మానిక్యంను జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా నియమించి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఈ నియామకాలు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, ఇందిరా, తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా అత్తపురం శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఎలిగని వెంకటేశ్‌గౌడ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌చారి

షాద్‌నగర్: పట్టణానికి చెందిన బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌చారి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి శ్రీనివాస్‌చారికి నియామకపత్రం అందజేశారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన పార్టీ పెద్దలు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, లక్ష్మీనారాయణ, దేపల్లి అశోక్‌గౌడ్, నర్సింహాగౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం



మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని న్యూసిటీ కాలనీలో గల శ్రీలక్ష్మి డ్రిల్లింగ్ టూల్స్ కార్యాలయంలో ఆదివారం ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్సరాల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా నాయకులు ఫరూఖ్‌నగర్ మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, ఎలికట్ట, హాజిపల్లి మాజీ ఎంపీటీసీ కావలి శ్రీశైలంను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, ఆర్ల యాదయ్య యాదవ్, శంకర్‌నాయక్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సన్నద్ధం!



కేతిరెడ్డిపల్లిలో గుంతలు తవ్విస్తున్న పంచాయతీ కార్యదర్శి తారాబాయి



కేతిరెడ్డిపల్లి నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

నర్సరీల్లో ఏపుగా పెరిగిన మొక్కలు

- మండలంలో 2.80లక్షలు నాటడమే లక్ష్యం
- స్థలాలు గుర్తిస్తూ.. గుంతలు తవ్విస్తూ..
- ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

మొయినాబాద్‌రూరల్: ఆకుపచ్చని తెలంగాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం హరితహారం పేరుతో మొక్కల పెంపకం చేపట్టగా.. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమంతో లక్షలాది మొక్కలు నాటుతూ అడవుల శాతాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటుంది. ఇందుకుగాను నర్సరీల్లో మొక్కలు నాటించి సంరక్షణకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో మొక్కలు ఏపుగా పెరిగి, ప్రస్తుతం నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి గ్రామంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొక్కలు నాటేందుకు గతవారం రోజుల నుంచి ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలతో జోరుగా గుంతలను తవ్విస్తున్నారు.

నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు..

మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీల్లో ఆయా నర్సరీల్లో అధికారులు రకరకాల మొక్కలు పెంచుతున్నారు. దాదాపు 30 రకాల మొక్కలు ప్రజలకు అవరమయ్యే పూలు, పండ్ల మొక్కలను ఎక్కువగా పెంచుతున్నారు. వర్షాలు సమయానికి కురవకపోవడంతోనే వన మహోత్సవం కింద మొక్కలు నాటడం ఆలస్యమైందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పుడు వర్షాలు కురుస్తుం డడంతో ఆయా గ్రామాల్లో అధికారులు మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం, స్థలాల గుర్తింపు తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. 28 గ్రామ పంచాయతీల్లో అవసరమైన మొక్కలను సిద్ధం చేశామని, త్వరలో నాటుతామని పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే మొక్కలు నాటడానికి గుంతలను తీయించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే మొక్కలు నాటుతామని చెబుతున్నారు. గ్రామ పంచాయతీకి వచ్చే నిధుల్లో 10 శాతం నిధులను గ్రీన్ బడ్జెట్‌కి వినియోగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక రక్షణ చర్యలు..

గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలతో పాటు ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంచుతున్నారు. కూలీలను పెట్టి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నారు. ఎండ, వేడిమి నుంచి తట్టుకునేలా గ్రీన్‌నెట్ వేసి నిత్యం మొక్కలకు నీరు పోస్తూ, నర్సరీలలో కలుపు తీయడం, సమయానికి ఎరువులు వేసి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవడంతో ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగాయి.

అన్ని గ్రామ పంచాయతీల్లో గుంతల తవ్వకాలు..

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో, రోడ్డుకిరువైపులా పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటేందుకు జోరుగా గుంతలను తీయిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి గ్రామంలో ఆరు వేల మొక్కలు నాటేందుకు అధికారులు సిబ్బందితో చురుకుగా గుంతలను తవ్విస్తున్నారు.

గుంతలు తవ్విస్తున్నాం



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు 6 వేల మొక్కలు నాటేందుకు కేతిరెడ్డిపల్లి గ్రామంలో గుంతలు తవ్విస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వెంటనే గ్రామాల్లో మొక్కలు నాటేందుకు కృషి చేస్తున్నాం. అధికారులు సూచించిన విధంగా ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్లకిరువైపులా, పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటే విధంగా గుంతలను తవ్విస్తున్నాం.

– తారాబాయి, పంచాయతీ కార్యదర్శి, కేతిరెడ్డిపల్లి

ఆదేశాలు రాగానే..



గ్రామాల్లోని నర్సరీలలో నాటేందుకు మొక్కలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించగానే గ్రామాల్లో మొక్కలు నాటేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకుగాను మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని ప్రతీ ఒక నర్సరీలో పది వేల మొక్కలు పెంచుతున్నాం. మండలం మొత్తం 2.80లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలో ఆరు వేల మొక్కలు నాటాలని సూచించింది. ఇందుకోసం అన్ని గ్రామాల్లో గుంతలు తవ్విస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మొక్కలు నాటుతాం.

– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రగతి విద్యాలయ ఉన్నత పాఠశాలలో 2007–08లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగుపల్లి సమీపంలో గల కంట్రి సైడ్ రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. 16 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరూ ఎంతో ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల వ్యవస్థాపకుడు రాధాకృష్ణారావు, ఉపాధ్యాయులు నరేందర్‌రావు, బాల్‌రాజ్, శశీకాంత్, రహీంను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అమర్‌నాథ్‌రెడ్డి, సందీప్, పీర్లగూడెం అభిలాశ్, రామకృష్ణ, సాయి, మేఘ్య, ప్రియాంక, సంధ్య, స్వప్న, శారద, విజయలక్ష్మి, అనురాధ, నందిని తదితరులు పాల్గొన్నారు.

గణితంపై మక్కువ పెంచాలి

గణిత ఫోరం రాష్ట్ర కోశాధికారి పాండురంగయ్య



గణిత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గణిత ఫోరం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులకు గణితంలో ఉన్న సందేహాలను నివృత్తి చేసి గణితంపై మక్కువను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గణితఫోరం రాష్ట్ర కోశాధికారి దొంతు పాండురంగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని కాకతీయ పాఠశాలలో గణిత ఫోరం డివిజన్ అధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో ప్రభుత్వం కల్పించిన పదోన్నతులలో భాగంగా జీహెచ్ఎంలుగా పదోన్నతి పొందిన గణిత ఉపాధ్యాయులు శ్రీశైలం, పాండురంగయ్య, బాబుచంద్, మల్లేషం, గణేశ్‌కుమార్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణిత ఫోరం రాష్ట్ర కోశాధికారి పాండురంగయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు గణితం అంటే భయపడకుండా ఇష్టంగా నేర్చుకునే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ మంది విద్యార్థులు గణితంలోనే ఫెయిల్ అవుతుంటారని, గణితంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు జీహెచ్ఎంలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గణిత ఫోరం డివిజన్ ప్రధాన కార్యదర్శి గణేశ్‌కుమార్, కోశాధికారి బాలప్రసాద్, గణిత ఉపాధ్యాయులు ప్రకాశ్, వరదారెడ్డి, రమామహేశ్వర్, శైలజ, సురేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కొత్తూరు: పట్టణంలోని ఫాతీమాపూర్ చర్చిలో ఆదివారం నిర్వహించిన ప్రార్థనల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఎమ్మెల్సీని స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుల, మతాలకతీతంగా అన్ని పండగలకు సమ ప్రాధాన్యత కల్పించినట్లు వివరించారు. తన గెలుపునకు సహకరించిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దిలీప్‌రెడ్డి, డోలీ రవీందర్, మెండె కృష్ణ, మాజీ ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, రమేశ్, అశోక్, కళ్యాణ్, నర్సింహ్మారెడ్డి, బాలయ్య, వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, మర్రెడ్డి, యాగారెడ్డి, బాల్‌రెడ్డి, శాంసన్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి, లూర్ధురెడ్డి, జోసఫ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు

చేవెళ్ల: గ్రామాల్లో ఉండే పేద ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలతో ఎంతో మేలు జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్‌బాబు అన్నారు. మండలంలోని అంతారం గ్రామంలో ఆదివారం నగరంలోని వనస్థలిపురంకు చెందిన సత్యసాయి సేవా సమితి వారి సహకారంతో అంతారం గ్రామ నాయకుడు వెంకటేశ్‌బాబు ఆధ్వర్యంలో ఉచిత ఓంసాయిరాం, గ్రామసేవ పేరుతో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, లక్ష్మీనారాయణ, సంతజీవ్‌కుమార్, అంజనేయులు, తరుణ్, వైద్య బృందం పాల్గొన్నారు.



బ్రిడ్జిపై భారీగా నిలిచిన వాహనాలు



రిటైనింగ్ వాల్ పనులు

ఫత్తేపూర్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌జామ్

గంటల తరబడి నిరీక్షిస్తున్న వాహనదారులు

పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జిపై ప్రతి నిత్యం వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. బ్రిడ్జి నిర్మించి ఏళ్లు అవుతున్నా అధికారులు మాత్రం ఇప్పుడు కళ్లు తెరిచారు. బ్రిడ్జికి ఒకవైపు(శంకర్‌పల్లివైపు) భారీ ఎత్తున గుంతలు పడడంతో రాత్రి వేళ వాహనాలు బోల్తా పడుతున్నాయి. దీంతో స్పందించిన అధికారులు వాల్ రిటైనింగ్ పనులను ప్రారంభించారు. దీంతో ఒకవైపు నుంచి వాహనాలను అనుమతించడంతో.. మరోవైపు వాహనాలను ఆపుతున్నారు. బ్రిడ్జిపై 2 నిమిషాల్లో వెళ్లాల్సిన వాహనాలు గంటన్నర నుంచి 2 గంటల పాటు ఆలస్యంగా వెళ్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లేవారి పరిస్థితి మరీ దారుణం. బ్రిడ్జిపై సగంలో ఆగితే అంతే సంగతులు.. ముందుకు, వెనక్కి వెళ్లలేని స్థితి. ఇప్పటికైనా అధికారులు పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజు



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కేశంపేట: కార్మికులకు యాజమాన్యం పనికి తగిన వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. తమకు వేతనాలను పెంచాలనే డిమాండ్‌తో మండల పరిధిలోని కొత్తపేట, మంగళిగూడ గ్రామాల శివారులో ఉన్న వేంకటేశ్వర హెచరీస్ అండ్ పౌల్ట్రీ ఫాంలో కూలీలు ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ ధర్నా ఆదివారం రెండోరోజుకు చేరుకుంది. ఈ ధర్నాకు రాజుతో పాటు బీఆర్ఎస్ నాయకులు కమ్మెకర్ నవీన్‌కుమార్‌లు వేర్వేరుగా సంఘీభావం తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు సీఐటీయూ అండగా ఉంటుందని వారు తెలిపారు. ఆయా కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, మాజీ మండల కో–ఆప్షన్ సభ్యుడు జమాల్‌ఖాన్, అల్వాల శ్రీను, జగన్‌రెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి



మహాపాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

మొయినాబాద్‌రూరల్: అయ్యప్ప మహాపాదయాత్రను విజయవంతం చేసేందుకు కృషి చేద్దామని ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మహాపాదయాత్ర కమిటీ సభ్యుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కనకమామిడి అయ్యప్ప గుట్టపై ఆలయ సన్నిధానంలో పాదయాత్ర గురుస్వాములతో కలిసి అల్లం శ్రీనివాస్‌రెడ్డి మహాపాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మండల పరిధిలోని అజీజ్‌నగర్ హనుమాన్ దేవాలయం నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమవుతుందని, భక్తులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వారికి కావాల్సిన ఇన్సూరెన్స్, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని సూచించారు. ఈ పాదయాత్రకు ధర్మంగారి స్వప్ననరేందర్‌రెడ్డి అన్నదాతగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ పాదయాత్ర అజీజ్‌నగర్‌లో అక్టోబర్ 15వ తేదీన ప్రారంభమై నవంబర్ 21న కేరళలోని స్వామివారి సన్నిధానంలో ముగుస్తుందని తెలిపారు. ఈ పాదయాత్రను విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరేందర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శివకుమార్, సురేందర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, గణేశ్, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ వ్యవస్థ పునఃరుద్ధరణకు చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యేకు రాష్ట్ర జేఏసీ నాయకుల వినతి



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఓ జేఏసీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: గ్రామాల్లో వీఆర్‌ఓ వ్యవస్థను పునఃరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వీఆర్‌ఓ రాష్ట్ర జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీఆర్‌ఓ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఓల పట్ల స్వార్థపూరితమైన నిర్ణయాన్ని తీసుకొని తమను ఇతర శాఖలకు మార్చిందన్నారు. వీఆర్‌ఓలు పడిన కష్టాన్ని గుర్తించకుండా ఇతర శాఖలకు కేటాయించారన్నారు. వీఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రభుత్వ భూములు, రైతుల భూములను కాపాడారన్నారు. వీఆర్‌ఓ వ్యవస్థను తొలగించిన తరువాత ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్‌ఓల కష్టాలను దృష్టిలో పెట్టుకొని గతంలో మాదిరిగా తమ ఉద్యోగాలను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వీఆర్‌ఓల సమస్యలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ విషయంపై సంబంధిత శాఖ మంత్రితో పాటుగా అధికారులతో చర్చించామని తెలిపారు. ప్రభుత్వం తప్పకుండా వీఆర్‌ఓల సమస్యలపై తగిన నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీఆర్‌ఓ జేఏసీ నాయకులు శ్రీహరి, రమేశ్, మాణయ్య, శ్రీనివాసులు, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్, రాంచంద్రయ్య, జగన్, షబ్బీర్‌అలీ, బచ్చయ్య, నరహరి, ఆంజనేయులు, జావెద్ పాల్గొన్నారు.

సీనియర్ రిపోర్టర్ సతీమణి మృతికి సంతాపం



సంగీత మృతదేహానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల: మండల కేంద్రానికి చెందిన సీనియర్ రిపోర్టర్ బి.వెంకటేశ్ సతీమణి సంగీత(42) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పామెన భీంభరత్‌లు శనివారం రాత్రి నివాళులర్పించారు. ఆదివారం ఉదయం తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేవెళ్లకు వచ్చి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్ కుటుంబ సభ్యులను ఓదార్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మృతికి పలువురు నాయకులు మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, మాజీ డీసీసీ నాయకులు పి.వెంకటస్వామి, చేవెళ్ల మండల కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ పార్టీల నాయకులు, జర్నలిస్టు సంఘం నాయకులు, జర్నలిస్టులు సంతాపం ప్రకటించి అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



చేవెళ్లలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



షాద్‌నగర్: జెండా ఆవిష్కరణలో నాయకులు

చేవెళ్ల: మాదిగ జాతి ఆత్మ గౌరవం కోసమే ఎమ్మార్పీఎస్ ఏర్పడి 30 ఏళ్లుగా ఉద్యమిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.శివశంకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో స్థిరంగా నిలబడి దేశంలోనే స్థిరంగా నడుస్తున్న ఏకైక ఉద్యమ సంఘం ఎమ్మార్పీఎస్ అని తెలిపారు. మాదిగల ఆత్మగౌరవం కోసం వారికి జరగాల్సిన న్యాయమైన వర్గీకరణకై పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొండిగారి మహేందర్, చేవెళ్ల మల్లికార్జున్, సంజయ్, వెంకటయ్య, మండ ల నాయకులు తదితరులు ఉన్నారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు ఇటీవల కొత్తగా వచ్చిన సీఐ భూపాల్‌శ్రీధర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐని కలిసి ఆయనకు శాలువాతో సన్మానించారు.

కేశంపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను, గంజాయి దశరథ, భీమయ్య, గ్యార సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు నిరంతర పోరాటం

షాద్‌నగర్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింలు ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్లనర్సింలు మాట్లాడుతూ.. 30 ఏళ్ల సామాజిక ఉద్యమ ప్రస్థానంలో హక్కుల సాధనకు అనేక ఉద్యమాలను చేపట్టామన్నారు. ఈ ఉద్యమాలతో అనేక హక్కులను సాధించుకోవడంతో పాటు సమస్యలను పరిష్కరించుకున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, మహేందర్, బాల్‌రాజ్, నాగభూషణ్, సురేశ్, జంగయ్య, లక్ష్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.